

స్వర్ణ కిరీటంతో అమ్మవారు


ఆలయంలో భక్తుల రద్దీ


నృత్య ప్రదర్శన

శరన్నవరాత్రి ఉత్సవాలు షురూ!

శ్రీభద్రకాళి ఆలయంలో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు బాలా త్రిపురసుందరీగా శ్రీభద్రకాళి అమ్మవారు దర్శనమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన స్వర్ణ కిరీటం, జుటా మకుటాలు, కర్ణ పత్రాలను భద్రకాళి అమ్మవారికి అలంకరించారు. తల్లి దర్శనానికి భక్తులు పోటెత్తారు. – ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే, రంగంపేట

(పూర్తి వివరాలు 6వ పేజీలో..)

ఆధార్ మాదిరిగా 'డిజిటల్ ఫ్యామిలీ కార్డు'


మాట్లాడుతున్న కొండా సురేఖ, వేదికపై కార్పొరేటర్ కవిత, కలెక్టర్ సత్యశారద, మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ

దేశాయిపేట(వరంగల్), న్యూస్‌టుడే: ఆధార్‌కార్డుకు ఉన్న ప్రాముఖ్యత డిజిటల్ ఫ్యామిలీ కార్డుకు ఉంటుందని, ఆ దిశగా 'ఒకే కుటుంబం- ఒకే డిజిటల్ కార్డు'ను అందిస్తామని దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గురువారం దేశాయిపేట 12వ డివిజన్‌లో పైలట్ ప్రాజెక్టుగా తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ముందుకెళ్తున్నామన్నారు. సర్వే పూర్తి పారదర్శకంగా చేపట్టనున్నట్లు వివరించారు.

● పాలనాధికారి డా.సత్యశారద మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టు కింద డివిజన్‌లో 150 కుటుంబాల వివరాలు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సర్వే తీరును పరిశీలించారు. మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు కవిత, కుమారస్వామి, పుర్ఖాన్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

నియోజక వర్గానికి 3500 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కొండా దంపతుల పేర్లతో పైరవీలు చేస్తే మా దృష్టికి తీసుకురావాలని ఏసీపీ నందిరాంనాయక్‌కు సూచించారు.

చోదకుడిపై మేయర్ ఆగ్రహం

పాలనాధికారి వాహన చోదకుడిపై నగర మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాయిపేటలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కార్యక్రమం ముగిసిన తర్వాత మేయర్ సుధారాణి తన వాహనం వద్దకు వెళ్లారు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న కలెక్టర్ వాహనం మేయర్‌ను స్వల్పంగా ఢీకొట్టింది. దీంతో మేయర్... కలెక్టర్ వాహన చోదకుడిని మందలించారు. ఇంత జరిగినా సదరు చోదకుడు డ్రైవింగ్ సీటులోనే ఉండి.. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో కలెక్టర్ ఫిర్యాదు చేస్తానన్నారు. ఈ ఘటన జరిగినప్పుడు గన్‌మెన్, చోదకుడు మాత్రమే ఉన్నారు. కలెక్టర్ మంత్రి సురేఖ వాహనంలో వెళ్లారు.



సినీతార సందడి..

మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో గురువారం సినీ నటి ప్రియాంక మోహన్ సందడి చేశారు. 'కాసం ఫ్యాషన్' మాల్ 13వ స్టోర్‌ను ప్రారంభించారు..

వివరాలు 6లో..

పైసలు లేవు.. పండగ ఏర్పాట్లు ఎలా?

● గ్రామాలకు అందని కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధులు

ఈనాడు, వరంగల్

బతుకమ్మ, దసరా రాష్ట్రంలో పెద్ద పండగలు. ప్రజలంతా ఒక్కచోట చేరి చేసుకునే వేడుకలు. ఈసారి పల్లెల్లో పండగ ఏర్పాట్లు ఎలా చేయాలని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేదని వాపోతున్నారు.



ఇదీ పరిస్థితి..

హనుమకొండ జిల్లా దామెర మండలం పంచాయతీ కార్యదర్శులు గత నెల 20న మండల పరిషత్తు అభివృద్ధి అధికారికి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం ఇస్తున్నారు. గ్రామాల్లో తీవ్ర నిధుల కొరత ఉందని, బతుకమ్మ, దసరా పండగల ఏర్పాట్లు మోయలేని భారంగా మారాయని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ పరిస్థితే నెలకొంది.




ఇది వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలోని చెరువు. సద్దుల బతుకమ్మ వేడుకలను ఇక్కడే నిర్వహిస్తారు. మరో రెండు మూడు రోజుల్లో చెరువు కట్ట మీద పిచ్చి మొక్కలు తొలగించాల్సి ఉంది.

● ఈ ఆర్థిక సంక్షోభం సమయంలో ఈసారి బతుకమ్మ, దసరా పండగలకు చెరువు కట్టల వద్ద విద్యుత్తు దీపాల ఏర్పాటు, కట్టలపై జంగిల్ కట్టింగ్, డీజే సౌండ్ ఏర్పాటు లాంటివి ఏర్పాటుచేసేందుకు తమ వద్ద డబ్బులు లేవని కార్యదర్శులు ఉన్నతాధికారులకు వినతులు ఇస్తూ నిధుల కోసం వేడుకుంటున్నారు. ఎఉమ్మడి వరంగల్‌లో వందలాది గ్రామాల్లో ఏర్పాట్లు ఎలా చేసేది అంటూ కార్యదర్శులు దిగులు చెందుతున్నారు.

ఫిబ్రవరిలో సర్పంచుల పదవీ కాలం పూర్తయిన తర్వాత కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. రాష్ట్రం నెలనెలా అందివ్వాల్సిన ఆర్థిక సంఘం డబ్బులు ఎన్నో నెలల తరబడి గ్రామాలకు అందడం లేదు. దీంతో ఇప్పటికే మోటార్ల మరమ్మతు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, వీధి దీపాల మరమ్మతుల కోసం తాము అప్పులు చేసి గ్రామ పాలన నడిపిస్తున్నామని కార్యదర్శులు చెబుతున్నారు.

● ములుగు 2022-23 సంవత్సరానికి సంబంధించి రూ.5.59 కోట్ల బకాయిలు గ్రామాలకు రావాల్సి ఉంది. ఈసారి బకాయిలు మూడు రెట్లకన్నా ఎక్కువగా పేరుకుపోవడంతో అనేక ఏజెన్సీ గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది.



ఇది వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీ గ్రామం. బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో డోజర్లు లేదా ట్రాక్టర్లతో మొక్కలను తొలగించాల్సి ఉండగా నిధులు లేకపోవడంతో పంచాయతీలోని మల్టీ పర్పస్ కార్మికులే చేతితో మొక్కలు పీకేస్తున్నారు. ఇలా అనేక పంచాయతీలకు అందాల్సిన నిధులు రాక పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అన్నింటికీ ఉద్దరే..

మేజర్ పంచాయతీలకు అంగడి ద్వారా ఆదాయం రావడంతో వారు వివిధ రకాల ఖర్చులకు సర్దుబాటు చేస్తున్నారు. చిన్న పంచాయతీలకు ఆదాయ వనరులు లేకపోవడంతో కార్యదర్శులు అప్పులు చేసి మరీ అవసరాలు తీరుస్తున్నారు. ఆర్థిక స్తోమత లేని వారు దుకాణాల్లో ఉద్దెర తెస్తున్నారు. గ్రామ సభలు ఏర్పాటుచేసినప్పుడు టెంట్ హౌజ్‌లు, ఎలక్ట్రిక్ బల్బులతోపాటు చిన్న చిన్న వస్తువులన్నీ సగం చెల్లించి మిగతాది ఉద్దెరగా తెస్తున్నామని చెబుతున్నారు. ప్రస్తుతం డెంగీ, విష జ్వరాలు విజృంభిస్తున్న క్రమంలో బ్లీచింగ్ పొడి కొనేందుకు, దోమల నివారణకు ఆయిల్‌బాల్స్ వేసేందుకు డబ్బులు లేవని ఇప్పుడు పైసలు లేకుండా పండగలు చేయడం తలకు మించిన భారం అవుతుందని కాబట్టి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రత్యేక నిధి తక్కువే

రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలకు నిధులు రాకపోవడంతో ప్రభుత్వం ఇప్పుడు తాత్కాలికంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.162 కోట్లను జీవో ద్వారా విడుదల చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఒక్కో గ్రామంలో ఏర్పాట్లకు కనీసం రూ.25 వేల నుంచి రూ.50 వేలు అంతకన్నా ఎక్కువే వెచ్చించాలి. ఈ నిధులు పంచితే దేనికీ సరిపోవని కార్యదర్శులు వాపోతున్నారు.

జిల్లాల వారీగా పంచాయతీలకు రావాల్సిన బకాయిలు

● జిల్లా	● గత ఆరు నెలలుగా రావాల్సిన బకాయిలు (రూ.కోట్లలో)	● పంచాయతీలు
ములుగు	18.85	208
హనుమకొండ	24.40	208
వరంగల్	27.95	325
జనగామ	24.76	283
మహబూబాబాద్	16.21	461
భూపాలపల్లి	18.22	240

ఆలయాల భూ ఆక్రమణలు నిజమే!

రామన్నపేట, న్యూస్‌టుడే: దేవాలయ స్థలాల ఆక్రమణల గుట్టు రట్టవుతోంది. గురువారం హైదరాబాద్ లోకాయుక్త న్యాయస్థానంలో హనుమకొండ శ్రీపద్మాక్షి, శ్రీసిద్ధేశ్వర, రంగనాయక స్వామి, వీర పిచ్చమాంబ, వరంగల్ వేణుగోపాల స్వామి ఆలయ భూముల ఆక్రమణపై విచారణ జరిగింది. ఈవోలు కె.వెంటకయ్య, ప్రసాద్, ఫిర్యాదుదారు జాతీయ వినియోగదారుల మండలి ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి హాజరయ్యారు. ఆక్రమణలు నిజమేనని వరంగల్ ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ అధికారులు అంగీకరించారు. కొన్ని భూములపై సర్వే పెండింగ్‌లో ఉందని, రెవెన్యూ, భూమి, కొలతల శాఖలతో సర్వే చేయిస్తామన్నారు. హనుమకొండ ప్రాంతం పద్మాక్షిగుట్టరోడ్డు వీర పిచ్చమాంబ ఆలయానికి చెందిన సర్వే నంబరు 882లో సుమారు 1089 గజాల స్థలంలో ఓ ప్రైవేటు కళాశాల ఆర్‌సీసీ భవనం నిర్మించిందని, యాజమాన్యానికి గతనెల 27న నోటీసు జారీ చేసినట్లు ఈవో లోకాయుక్త న్యాయస్థానానికి నివేదించారు. దేవాదాయ ట్రిబ్యునల్‌లో కేసు దాఖలు చేస్తామన్నారు. మిగిలిన 2.15 ఎకరాలు ఓ ప్రైవేటు పాఠశాల ఆక్రమించిందని, రెవెన్యూ శాఖ పరిధిలో ఉందని న్యాయస్థానానికి వివరించారు. అన్ని ప్రభుత్వశాఖలు సర్వేలు పూర్తి చేయాలని, తదుపరి విచారణ వచ్చేనెల 7వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ సీవీ.రాములు తెలిపారు.

హామీల అమలే లక్ష్యంగా ప్రభుత్వ పాలన


సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క చిత్రంలో ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితరులు

పర్వతగిరి, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. మండల పరిధిలో పలు అభివృద్ధి పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. చౌటపల్లి గ్రామంలో 'వన మహోత్సవం'లో భాగంగా మొక్క నాటారు. అనంతరం పీఏసీఎస్ నూతన భవనం, రూ.11.47 కోట్ల నిధులతో చేపట్టిన రోడ్ల నిర్మాణాలకు, 500 మెట్రిక్ టన్నుల గోదాంలకు ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డిలతో కలిసి మంత్రి సీతక్క శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. గత భారాస ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రస్తుతం రూ.వేల కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోందని ఆరోపించారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి ప్రభుత్వం మూడు వేల నుంచి 5 వేల ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. పర్వతగిరి పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరించాలని ఎంపీ కడయం కావ్య మంత్రి సీతక్కను కోరగా.. ఆమె సానుకూలంగా స్పందించారు. పారా ఒలింపిక్స్ క్రీడాకారిణి దీప్తికి ప్రభుత్వం రూ.కోటి నగదు, 500 గజాల ఇల్లు, ఎస్సై ఉద్యోగం ఇచ్చి భరోసాగా నిలిచిందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సభలో పేర్కొన్నారు.

కార్మికులకు ఇంకా జీతాలు ఇవ్వలేదా?

పర్వతగిరి మండలం చౌటపల్లి గ్రామంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన మంత్రి సీతక్కను గ్రామ పంచాయతీ కార్మికులు కలిశారు. నెలలు గడుస్తున్నా జీతాలు రావడం లేదని వినతిపత్రం అందజేశారు. జీతాలు ఇంకా ఇవ్వలేదా..? రూ.1.50 కోట్లు పంచాయతీలకు విడుదల చేశామని మంత్రి చెప్పారు. తక్షణమే కార్మికులకు జీతాలు ఇవ్వాలని లేకుంటే డీపీఓపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని సీతక్క హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చౌటపల్లి సొసైటీ ఛైర్మన్ దేవేందర్, వైస్ ఛైర్మన్ మధుసూదన్‌రావు, అదనపు పాలనాధికారి సంధ్యారాణి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, మండల ప్రత్యేక అధికారిణి నీరజ, కల్లెడ సొసైటీ ఛైర్మన్ మనోజ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు అనిల్‌రావు, శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: 2024-25 వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా పాలనాధికారి డా. సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల కోసం మొత్తం 203 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కేంద్రాల్లో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్లు, డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన తదితర అంశాలపై గురువారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో కలిసి పాలనాధికారి పాల్గొన్నారు.

ఆవిష్కరణ నిరుపయోగం



ప్రతిరోజు పదుల సంఖ్యలో ప్రజలు జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వస్తుంటారు. ప్రజావాణి సమయంలో ఆ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రజల ఉపయోగార్థం కలెక్టరేట్ ఆవరణలో సోలార్ మొబైల్ ఛార్జర్‌ను 2018లో అప్పటి కలెక్టర్ ఏర్పాటు చేశారు. అయితే ఛార్జర్ నిర్వహణను పట్టించుకునే వారు కరవయ్యారు. దాంతో నర్సంపేటకు చెందిన రాజు అనే ఔత్సాహికుడి ఆవిష్కరణ.. నిరుపయోగకరంగా మారింది.

– న్యూస్‌టుడే, వరంగల్ కలెక్టరేట్



గజరాజు జెండా వందనం!

వరంగల్ రైల్వే స్టేషన్ ముందు ఏర్పాటు చేసిన ఏనుగుల విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. ఒక్కో వరుసలో అయిదు గజరాజులను నాలుగు భాగాలుగా ఏర్పాటు చేశారు. దాని ముందే భారీ జెండా మరింత ఆకర్షణగా నిలుస్తోంది. వరంగల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ గజరాజుల బొమ్మలు ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. జెండాతో కలిపి పైకి చూస్తే ఏనుగులు జెండాకు వందనం చేస్తున్నట్లు ఉంది.

– ఈనాడు, హనుమకొండ

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, శ్రీ మహమ్మద్ ఇబ్రహీం, తండ్రి: యాకూబ్ అలి, నివాసం : నెక్కొండ గ్రామం & మండలం, వరంగల్ జిల్లా అనువారు ఈ క్రింది షెడ్యూలు నందు తెలిపిన ప్లాటులో ఇంటి నిర్మాణం చేయుటకు మా బ్యాంకు శాఖను సంప్రదించినారు. అటుపిమ్మట వారు మరణించినారు. ఈ క్రమంలో సదరు ఆస్థియొక్క ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. అవి టైటిల్ డీడ్/రిజిస్ట్రేషన్ దస్తావేజు నం. 693/2013, తేది: 30-03-2013, స.రి.కా. నర్సంపేట, ఇంటి నిర్మాణం అనుమతి పత్రం, ప్లాను, తేది: 28-12-2015 పహానీలు మరియు తనఖా దస్తావేజు డాక్యుమెంట్ నెం. 216/2016, తేది: 12-02-2016, స.రి.కా. నర్సంపేట జిల్లా వినియోగదారుల కమీషన్, వరంగల్ వారు C.C. No. 134/2022 లో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ ప్రకటన జారీ చేయబడినది.

ఆస్థి వివరణ : వరంగల్ జిల్లా నెక్కొండ మండలం మరియు గ్రామ మండలి సర్వే నెం. 16/1/అ నందలి 156.70 చ॥గ॥ విస్తీర్ణం గల ప్లాటు హద్దులు : ఉత్తరం గ్రామ పంచాయితీ రోడ్డు, దక్షిణం: బి. చంద్రమౌళి గారి ఇల్లు, తూర్పు: ఎం.డి. ఇబ్రహీం, పి. సమ్మయ్య ఎ. సర్సింహాచారి, జి. రాజేందర్ మరియు ఎం.డి. షమ్మి గారల స్థలము. పడమర: రోడ్డు.

ఇట్లు
బ్రాంచ్ మేనేజర్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
నెక్కొండ శాఖ, వరంగల్ జిల్లా

స్థలం: నెక్కొండ
తేది: 01-10-2024

స్వాగత వేడుక.. ఉర్రూతలూగిన వేదిక


వేదికపై ర్యాంప్ వాక్..

హసన్‌పర్తి మండలం అనంతసాగర్ శివారులోని ఎస్సార్ విశ్వ విద్యాలయంలో గురువారం నూతన విద్యార్థుల స్వాగతోత్సవం (ఫ్రెషర్స్ డే) వైభవంగా నిర్వహించారు. ఉప కులపతి ప్రొఫెసర్ కె.దీపక్ గార్గ్ జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు ర్యాంప్ వాక్, సాంస్కృతిక కార్యక్రమాలతో అదరహో అనిపించారు. సినీ గాయకులు అనుదీప్ దేశ్, అనన్యా భాస్కర్ సినిమా పాటలతో ఉర్రూతలూగించారు. వేదిక ముందు కూర్చున్న విద్యార్థులు స్టెప్పులేస్తూ సందడి చేశారు. రిజిస్ట్రార్ ఆర్.అర్చనారెడ్డి, స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ శశి, అధ్యాపకులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, హసన్‌పర్తి


పాటలతో ఉర్రూతలూగిస్తున్న సినీ గాయకులు అనుదీప్ దేశ్, అనన్యా భాస్కర్


విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

అందరం ఒకటిగా.. ర్యాగింగ్‌కు దూరంగా



ఇంజినీరింగ్, ఫార్మసీ తరగతులు ఇటీవల ప్రారంభమయ్యాయి. నీట్ కౌన్సెలింగ్ ముగించుకొని త్వరలో వైద్య విద్యార్థులు కళాశాలలకు రానున్నారు. కొత్త కళాశాలలు.. కొత్త వాతావరణం.. దీనికి తోడు ర్యాగింగ్ భయం. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని బయటకొచ్చిన విద్యార్థులకు ఇక్కడ కాస్త బెరుకుగానే ఉంటుంది. సీనియర్ల శ్రుతి మించిన చేష్టలు వారిని ఆందోళనకు గురిచేస్తుంటాయి. ఈ భయం పోగొట్టడానికి కళాశాలల్లో యాజమాన్యాలు, అధ్యాపకులు కృషి చేయాలి.
–న్యూస్‌టుడే, విద్యానగర్, హసన్‌పర్తి

● 2021 సెప్టెంబర్‌లో వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం సృష్టించింది. ఉత్తరాదికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్తకు చెందిన విద్యార్థిని ర్యాగింగ్ చేయడం సంచలనం సృష్టించింది. కేంద్రస్థాయిలో ఒత్తిడి రావడంతో విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు.

● గతేడాది రాజస్థాన్‌కు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థిని ర్యాగింగ్ చేసిన ఏడుగురు విద్యార్థులపై మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ విషయంలో జాగ్రత్త..

- ఇతర విద్యార్థుల పట్ల అమానుషంగా, కఠినంగా వ్యవహరించడం
- మొబైల్ ఫోన్ల ద్వారా ఫొటోలు, వీడియోలు తీయడం
- శారీరకంగా, మానసికంగా వేధించడం
- సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా ప్రవర్తించడం

ఏం చేయాలంటే..

ర్యాగింగ్ నిరోధానికి ప్రభుత్వం 1997లో చట్టం తీసుకొచ్చింది.

● ప్రతి విద్యాసంస్థలో అనుభవం ఉన్న ప్రొఫెసర్, స్థానిక పోలీసు అధికారి భాగస్వామ్యంతో కమిటీలను ఏర్పాటు చేయాలి.

● చట్టాలను అతిక్రమిస్తే విధించే శిక్షలు తెలిపే బోర్డులను ప్రతి విద్యాలయంలో అందరికీ కనిపించే ప్రదేశాల్లో ఉంచాలి.

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక గోడ పత్రికలు ప్రదర్శిస్తామని రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి తెలిపారు.

అతిక్రమిస్తే శిక్షలు తప్పవు..

- రూ.2.50 లక్షల వరకు జరిమానా.
- సదరు విద్యార్థి ప్రవేశం రద్దు చేసి, కళాశాల నుంచి బహిష్కరణ.
- మరే ఇతర కాలేజీలో చేరే అవకాశం లేకుండా చేయటం.
- పోలీసు కేసు నమోదు..

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలు (ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలు)

ఇంజినీరింగ్ కళాశాలలు	7		
పీజీ	72	ఫార్మసీ	37
డిగ్రీ	262	ఎంబీఏ, ఎంసీఏ	30
గురుకుల డిగ్రీ	30	బి.ఎడ్	41
		న్యాయ	4



కేయూలో యాంటీ ర్యాగింగ్ గోడపత్రిక విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, అధ్యాపకులు

పకడ్బందీగా యాంటీ ర్యాగింగ్ కమిటీలు..


హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ శివారులోని ఎస్సార్ విశ్వవిద్యాలయం, భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 2009లో యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఏటా బీటెక్, ఫార్మసీ, ఎంబీఏ, అగ్రికల్చర్ బీఎస్సీలో చేరుతున్న విద్యార్థులకు ర్యాగింగ్ సమస్య తలెత్తకుండా విశ్వవిద్యాలయం అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పూర్తికాగానే యాంటీ ర్యాగింగ్ సదస్సులు ఏర్పాటు చేసి, పోలీసు అధికారులతో పాటు ఇతర శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో అవగాహన కల్పిస్తున్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే పోలీసు శాఖ చర్యలు, చట్టాల గురించి వివరిస్తున్నారు. దీనికి తోడు క్రమశిక్షణ కమిటీలను ఆయా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘం ప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేస్తున్నారు. ర్యాగింగ్ రహిత విశ్వ విద్యాలయాలుగా తీర్చిదిద్దడానికి అధ్యాపకులు, విద్యార్థి ప్రతినిధులు కృషి చేస్తున్నారు.

డయల్ 100కు కాల్ చేయండి..: – ఎస్‌కే. సలీమా, సెంట్రల్ జోన్ డీసీపీ

విద్యార్థులకు ర్యాగింగ్ సమస్య ఎదురైనప్పుడు డయల్ 100కు కాల్ చేయాలి. 5 నిమిషాల్లో పోలీస్ పెట్రోలింగ్ వాహనం మీ ముందు ఉంటుంది. విద్యార్థినులకు రక్షణగా షీ బృందాలు 24 గంటలు అందుబాటులో ఉంటాయి. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు పోటీ తత్వంతో చదవాలి. ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువును కొనసాగించాలి. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి.



ఎస్సార్ విశ్వ విద్యాలయంలో జరిగిన యాంటీ ర్యాగింగ్ సదస్సులో మాట్లాడుతున్న సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా



పరిచయ కార్యక్రమాలతో ప్రోత్సాహం

– ప్రవళిక, ఇంజినీరింగ్ మూడో సంవత్సరం, మహిళా ఇంజినీరింగ్ కళాశాల, కేయూ క్యాంపస్

విద్యా సంవత్సరం ప్రారంభంలో అధ్యాపకుల సహకారంతో మొదటి సంవత్సరం విద్యార్థులతో పరిచయ కార్యక్రమాలు నిర్వహిస్తాం. దీనిద్వారా కొత్తవారికి భయం పోతుంది. వారిని సహ సంబంధ కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తాం. కలివిడిగా ఉండడం ద్వారా సీనియర్, జూనియర్ అనే తేడా ఉండదు.



భయం పోయింది..

– యాకేష్, ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం, కోఎడ్యుకేషన్ కళాశాల, కేయూ క్యాంపస్

ఇంటర్ తర్వాత ఇంజినీరింగ్ కొంత భయంగా ఉండేది. సీనియర్లు మమ్మల్ని ప్రోత్సహించే విధంగా ఉండాలి. అధ్యాపకులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల బిడియం, భయం పోయాయి. సందేహాల నివృత్తికి సీనియర్, జూనియర్ విద్యార్థుల భాగస్వామ్యం అవసరం.

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు



బాలాత్రిపుర సుందరీగా భద్రకాళి



జ్యోతి వెలిగించి ఉత్సవాలు ప్రారంభిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దంపతులు

రంగంపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన శ్రీభద్రకాళి అమ్మవారి ఆలయంలో గురువారం శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు బాలా త్రిపురసుందరీగా శ్రీభద్రకాళి అమ్మవారు దర్శనమిచ్చారు. అంతకుముందు ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో అమ్మవారికి పూర్ణాభిషేకం చేశారు. అనంతరం ఉత్సవానుజ్ఞ ప్రార్థన, గణపతి పూజ, ధ్వజారోహణం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన స్వర్ణ కిరీటం, జుటా మకుటాలు, కర్ణ పత్రాలను భద్రకాళి అమ్మవారికి అలంకరించారు. ఉదయం వృషభ వాహన సేవ, సాయంత్రం మృగ వాహన సేవలు జరిగాయి. భవానీ దీక్షదారులు, భక్తులు, మహిళలతో దేవాలయం కిటకిటలాడింది. మధ్యాహ్నం, రాత్రి మహా అన్నదానం చేశారు.

● రెండోరోజు శుక్రవారం శ్రీభద్రకాళి అమ్మవారిని అన్నపూర్ణ మాతగా అలంకరిస్తారని, ఉదయం బ్రహ్మచారిణి దుర్గార్చన, 11 గంటలకు మకర వాహన సేవ, సాయంత్రం చంద్రప్రభ వాహన సేవలుంటాయని ఈవో శేషుభారతి తెలిపారు.

తొర్రూరులో 'కాసం ఫ్యాషన్స్' ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీనటి ప్రియాంక మోహన్, నిర్వాహకులు

తొర్రూరు, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని టీచర్స్ కాలనీ ప్రధాన రహదారి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 'కాసం ఫ్యాషన్స్' మాల్ 13వ స్టోర్‌ను గురువారం సినీనటి ప్రియాంక మోహన్ ప్రారంభించారు. మొదట జ్యోతి వెలిగించి మాల్‌లోని లేడీస్, జెంట్స్, కిడ్స్‌వేర్ దుస్తులను పరిశీలిస్తూ సందడి చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన అధునాతన వస్త్రాలను సరసమైన ధరలకే అందించడానికి కాసం సెలక్షన్స్ నూతన స్టోర్‌ను అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. షాపింగ్‌మాల్ డైరెక్టర్‌లు కాసం ఓంనమఃశివాయ, మల్లికార్జున్, కేదారినాథ్, శివప్రసాదులు మాట్లాడుతూ.. బతుకమ్మ, దసరా, దీపావళి సందర్భంగా నూతన స్టాక్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. సినీనటి ప్రియాంకమోహన్‌ను చూడటానికి యువత పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో నిర్వాహకులు కాసం ఫణి, సాయికృష్ణ, ధీరజ్, ప్రీతమ్, ప్రవీణ్, పల్లూరి అరుణ్‌కుమార్, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

● సినీనటి ప్రియాంకమోహన్‌తోపాటు కాంగ్రెస్ పాలకుర్తి ఇన్‌ఛార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మాల్ ముందు ఏర్పాటు చేసిన స్టేజిని ఎక్కుతున్న తరుణంలో అది ఒక్కసారిగా కూలిపోయింది. ఝాన్సీరెడ్డికి గాయాలు కావడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మిగతా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

సెమీస్‌కు చేరిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు సెమీస్‌కు చేరాయి. గురువారం కోమటిపల్లి మైదానంలో నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లా జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో ఒక్క వికెట్ తేడాతో ఖమ్మం విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు నిర్ణిత 35 ఓవర్లలో 207 పరుగులు చేసింది. విక్రాంత్‌రెడ్డి 137 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఖమ్మం జట్టు నిర్ణీత 35 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి.. సెమీస్‌లోకి దూసుకెళ్లింది. దివిన్ 75, రత్న ఆర్యన్ 45 పరుగులతో విజయంలో కీలకపాత్ర పోషించారు.

● మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్ ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొన్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ జట్టు 46.3 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో విజ్ఞాన్ 59 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఆదిలాబాద్ జట్టు 32.3 ఓవర్లలో 102 వద్ద కుప్పకూలింది. జట్టులో ఆల్ రౌండర్ తక్షిల్ 39 పరుగులు చేసి 3 వికెట్లు తీశాడు. శుక్రవారం కోమటిపల్లి మైదానంలో కరీంనగర్, నల్గొండ: మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, ఖమ్మం జట్ల మధ్య సెమీస్ మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)
వెన్‌కాబ్

ఫాం:	112
రిటైల్:	134
డ్రెస్డ్:	194
స్కిన్‌లెస్:	221

అడవిని చూసొద్దాం.. వన్యప్రాణులను కాపాడుదాం

ఏటూరునాగారం అభయారణ్యంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన కెమెరాలకు ఇటీవల చిక్కిన వన్యప్రాణులు..

















రోజురోజుకు వన్యప్రాణులు అంతరించిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం వాటి రక్షణకు చర్యలు చేపడుతున్నా వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్నాయి. ఉమ్మడి వరంగల్‌లో విస్తారంగా ఉన్న అటవీ ప్రాంతంలో అనేక అరుదైన వన్యప్రాణులు ఉన్నాయి.. మనకు విస్తారమైన అటవీ ప్రాంతం ఉంది. ఆ అందాలను వీక్షిస్తూనే అందులో నివసిస్తున్న వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉంది.. శుక్రవారం ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం.
ఏటూరునాగారం, న్యూస్‌టుడే

● ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో మొత్తం 6.26 లక్షల హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి.

సంరక్షణ చర్యలు ఇలా..

ఏటూరునాగారం అభయారణ్యం మొత్తం 806 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 146 గ్రామాలతో, ఏటూరునాగారం నాలుగు రేంజి కార్యాలయాలతో విస్తరించి ఉంటుంది. ఇందులోని వన్యప్రాణులను కాపాడేందుకు అటవీ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. సాసర్ పిట్లు, నీటి తొట్టెలలో ప్రతి రోజూ నీటిని పోయడం, నిర్మానుష్య ప్రదేశాలలో అడవి జంతువులు సంచరించే ప్రాంతాల్లో ఉప్పు గడ్డలు వేయడం, పచ్చిగడ్డిని నీటి తొట్లు, సాసర్‌పిట్లు ఉన్న చోట వేయడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. అటవీ అధికారులు ఎవరి బీట్ పరిధిలో వారు నిత్యం క్షేత్రస్థాయి పర్యటన చేస్తూ అడవులో వేటగాళ్లు విద్యుత్తు తీగలు అమర్చారా, ఉచ్చులు అమర్చారా అని పర్యవేక్షిస్తుంటారు. అడవి జంతువుల ఆనవాళ్లు ఎక్కడ ఉన్నాయి, ఉన్నాయా? లేవా అని తెలుసుకునేందుకు అవి సంచరించే నిర్జన ప్రదేశాల్లో కెమెరా ట్రాప్స్ ఏర్పాటు చేస్తారు. ప్రధానంగా అడవిలో నీటి వనరులున్న చోట కెమెరా ట్రాప్‌లు, ఉప్పు గడ్డల వంటివి ఏర్పాటు చేసి వాటి ఆనవాళ్లు సేకరిస్తారు.



ఏటూరునాగారం సబ్ డివిజన్‌లోని అడవి విస్తీర్ణం తెలిపే మ్యాపు

● ములుగు జిల్లాలో 7,27,821 ఎకరాల్లో అడవులు ఉన్నాయి. ములుగు, తాడ్వాయి, వెంకటాపురం, ఏటూరునాగారం సబ్ డివిజన్లతో 13 అటవీ రేంజి కార్యాలయాలతో 77 బ్లాకులతో అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ పని చేస్తోంది. ఇందులో 806.15 చదరపు కిలో మీటర్ల పరిధిలో వన్యప్రాణి సంరక్షణ కేంద్రం విస్తరించి ఉంది.

చట్టం ఏం చెబుతుందంటే..

వన్యప్రాణులను వేటాడటం నిషేధమని వన్యప్రాణుల సంరక్షణ చట్టం-1972 చెబుతోంది. అభయారణ్యంలో వేటగాళ్లు నిత్యం అడవి జంతువుల పాలిట మరణమృదంగాన్ని మోగిస్తూనే ఉన్నారు. వేటగాళ్లు అమర్చే ఉచ్చులు, విద్యుత్తు తీగలు వన్యప్రాణుల ప్రాణాలు ఏదో ఒక ప్రాంతంలో కబలిస్తూనే ఉన్నాయి.

● వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం అటవీ జంతువులను వేటాడినట్లు రుజువైతే మూబడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేలు జరిమానా విధిస్తారు. ఏ ఒక్కరికీ ఈ శిక్షలు పడిన దాఖలాలు లేవు.

వారోత్సవాలకు శ్రీకారం..



వన్యప్రాణుల సంరక్షణకు పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక(యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్), జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడిగా కృషి చేస్తున్నామని విశ్రాంత జిల్లా అటవీ అధికారి కాజీపేట పురుషోత్తం అన్నారు. ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షుడు ఇందారం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఈ సంస్థలు వన్యప్రాణులు అంతరించిపోకుండా సంరక్షణకు నడుం బిగించాయి. ఈ నెల 2 నుంచి 8 వరకు జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఆరుబయట ఆసుపత్రి వ్యర్థాలు



వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆవరణలో..

నగరంలో ఆసుపత్రి వ్యర్థాలు యథేచ్ఛగా ఆరుబయట పడేస్తున్నారు. 'బయో మెడికల్ వేస్ట్ ప్లాంట్'కు తరలించాల్సిన వాటిని వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆవరణలో కుప్పలుగా పోశారు. ప్రతి ఆసుపత్రిలోని వ్యర్థాలను 'బయోవేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్'కు అప్పగించాల్సి ఉంటుంది. నేత్ర వైద్యశాలలో అలా చేయకుండా ఆసుపత్రి ఆవరణలో పడేయడంతో కుక్కలు, పందులు వాటిని చిందరవందర చేస్తున్నాయి. దీనివల్ల అనేక అనర్థాలు జరుగుతాయని తెలిసినా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి



నీటిలో పచ్చని ప్రతిబింబం..!

మహబూబాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని కంబాలపల్లి చెరువు చుట్టూ ప్రకృతి సౌందర్యం కనువిందు చేస్తోంది. ఇటీవల కురిసిన భారీవర్షాలకు జలకళ సంతరించుకొంది. జలాశయం చుట్టూ ఉన్న పచ్చని చెట్లతోనిండిన గుట్ట ప్రతిబింబం చెరువులో పచ్చందాలు పరిచినట్లు కనిపిస్తూ చూపరులను ఆకట్టుకొంటోంది. –న్యూస్‌టుడే, మహబూబాబాద్ రూరల్

బామ్మ బంగారం.. దొరికిందోచ్!



కొంతమందికి పట్టిందల్లా బంగారం అవుతుందని అంటారు.. నిజమే..! తెలియకుండానే ఓ వ్యక్తి బియ్యం పట్టుకుంటే బంగారం అయ్యింది.. అది ఎంతోసేపు నిలవలేదు. చివరికి వచ్చిన చోటుకే చేరి కథ సుఖాంతమైంది. స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన కట్ల సోమలక్ష్మి అనే వృద్ధురాలు ప్రభుత్వం ఇచ్చిన రాయితీ బియ్యం సంచిలో ఐదు తులాల బంగారం దాచి పెట్టింది. గ్రామంలో ఓ వ్యక్తికి మంగళవారం సాయంత్రం ఆ బియ్యం సంచి విక్రయించింది. బంగారం దాచుకున్న సంచి వేరే ఉందని భావించింది. అయితే ఆ సంచిని తెరిచి చూడగా అందులో బంగారం కనిపించలేదు. బంగారం దాచిన బియ్యం సంచినే విక్రయించినట్లు గుర్తించి లబోదిబోమంటూ విషయం కుటుంబసభ్యులకు వివరించింది. బియ్యం కొనుగోలు చేసిన వ్యక్తి మరుసటి రోజు మళ్లీ అదే గ్రామానికి రాగా అతన్ని పట్టుకొని విషయం చెప్పగా.. గ్రామంలోని ఓచోట 15 బస్తాల వరకు బియ్యాన్ని నిల్వ చేసినట్లు చెప్పాడు. కుటుంబసభ్యుల సాయంతో బియ్యం సంచులను విప్పి వెతకగా బంగారం దొరికింది. దీంతో వృద్ధురాలు సోమలక్ష్మితో పాటుగా కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.
– న్యూస్‌టుడే, స్టేషన్‌ఘన్‌పూర్

వృత్తి నైపుణ్యంతోనే విధుల్లో రాణింపు



పోలీసు డ్యూటీ మీట్‌లో అధికారుల పనితీరును పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీశాఖలో పనిచేస్తున్న అధికారులు విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్‌లో వరంగల్, ఖమ్మం కమిషనరేట్లు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన అధికారుల జోనల్ డ్యూటీ మీట్‌ను ఆయన ప్రారంభించారు. పోలీసు అధికారులకు కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, వేలిముద్రల సేకరణ, హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫొటో, విడియోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఒక్కో విభాగంలో ఇద్దరు చొప్పున ప్రతిభ కనబర్చినవారిని ఎంపిక చేసి, హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోలీసు డ్యూటీ మీట్‌కు పంపించనున్నారు. సీపీ మాట్లాడుతూ.. నేరాలు కొత్తకొత్త పద్ధతుల్లో జరుగుతున్నాయని, వాటిని నియంత్రించాలంటే.. విచారణ నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. అదనపు డీసీపీ రవి, జోనల్ ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క మది దోచిన 'ఈనాడు' చిత్రం

ప్రకృతి పర్యాటకానికి ప్రసిద్ధి గాంచిన ములుగు జిల్లాలోని అడవుల అందాలను 'అచ్చంగా అమెజాన్ అడవిలా.. కొండ్రేడు అందాలిలా.. అనే శీర్షికతో గురువారం ఈనాడు ప్రధాన పత్రిక మొదటి పేజీలో ప్రచురితమైన చిత్ర కథనం మంత్రి సీతక్కను అమితంగా ఆకర్షించింది. ప్రకృతి రమణీయ చిత్రాన్ని 'ఈనాడు' రాష్ట్రానికి తెలియజేయడం అభినందనీయమని అన్నారు. ములుగు జిల్లాలో గురువారం ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంగపేటలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈనాడు చిత్ర కథనాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు.
–మంగపేట, న్యూస్‌టుడే

భారీగా గుట్కా పట్టివేత



గుట్కాను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: అక్రమంగా రవాణా చేస్తున్న నిషేధిత గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్ కథనం మేరకు... కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన ఆర్.శ్రీధర్ వ్యాన్‌లో గుట్కా తీసుకొని వరంగల్‌లోని పాన్ దుకాణానికి సరఫరా చేసేందుకు వస్తున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిఘా ఉంచారు. గురువారం ఎనుమాముల ఠాణా పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్ వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో వివిధ కంపెనీలకు చెందిన రూ.8.91లక్షల విలువ చేసే గుట్కా లభించింది. వ్యాన్‌ను సీజ్ చేసి, పాన్ దుకాణం యజమాని కృష్ణతో పాటు సరఫరా చేస్తున్న శ్రీధర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు, విచారణ కోసం ఎనుమాముల పోలీసులకు అప్పగించామని ఏసీపీ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, ఆర్ఎస్సై భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి మార్కెట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ఈనాడు కథనానికి స్పందన

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: ఎనుమాముల పరిధిలో మామిడి మార్కెట్ ఏర్పాటు కోసం ఎట్టకేలకు మార్గం సుగమమైంది. నాలుగేళ్లుగా గీసుకొండ మండలంలోని జానకీరామ ఇండస్ట్రీలో వ్యాపారులు మామిడి పండ్ల క్రయవిక్రయాలు జరుపుతున్నారు. అక్కడ స్థల కొరతతో.. చాలావరకు మామిడి రైతులు తమ సరకు విక్రయించేందుకు ఇతర ప్రాంతాలకు తరలించేవారు. దాంతో మార్కెట్ ఆదాయానికి భారీగా గండిపడటంతో పాటు అధికారుల పర్యవేక్షణ కొరవడి.. వ్యాపారులు తరుగు పేరుతో రైతులకు చెల్లింపుల్లో కోత విధించేవారు. ఈ నేపథ్యంలో ఎనుమాముల పరిధిలో మామిడి మార్కెట్ ఆవశ్యకతపై గత జులై 29న ఈనాడులో 'తగ్గుతున్న మార్కెట్ 'ఆమ్'దాని' శీర్షికన ప్రచురితమైన కథనానికి మార్కెట్ అధికారులు స్పందించారు. గురువారం మార్కెట్ అధికారులు.. పండ్ల వ్యాపారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో కలిసి ఎనుమాముల ముసలమ్మకుంటలోని మార్కెట్ స్థలాన్ని పరిశీలించారు. సుమారు 10.20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆ స్థలం మామిడి మార్కెట్‌కు అనువుగా ఉంటుందని వ్యాపారులు సుముఖత వ్యక్తం చేశారు. వాహనాల రాకపోకలకు అర కిలోమీటరు మేర రోడ్డు నిర్మాణం, చెట్ల తొలగింపు చేపట్టి మామిడి మార్కెట్ ఏర్పాటు కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని మార్కెట్ కార్యదర్శి నిర్మల తెలిపారు.

స్వచ్ఛ ఆటోలకు ఎదురుచూపులు


ఇంటి ముందు పోసిన చెత్త

కార్పొరేషన్, న్యూస్‌టుడే

పండగ వేళ ఇళ్లలో చెత్త పేరుకుపోతోందని నగర ప్రజలు వాపోతున్నారు. నగరంలోని 66 డివిజన్లలో ప్రతిరోజూ ఇంటింటా చెత్త సేకరణ చేపడుతున్నట్లు గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్య విభాగం లెక్కలు చెబుతున్నాయి. కానీ! వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే రెండు, మూడు రోజులకోసారి చెత్త ఆటో వస్తోందని ప్రజలు చెబుతున్నారు. అది కూడా నిర్దిష్టమైన సమయం పాటించడం లేదంటున్నారు. స్వచ్ఛ ఆటోల కోసం కాలనీల్లో ప్రజలు ఎదురుచూస్తున్నారు. కొందరు ఇళ్లలో పోగైన చెత్తను రోడ్లపై వేస్తున్నారు. ప్రజారోగ్య విభాగం అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇంటింటా చెత్త సేకరణ క్రమం తప్పింది. 250 గ్రేటర్ స్వచ్ఛ ఆటోలు, 152 ఓనర్ కం డ్రైవర్ల వాహనాలు తిరుగుతున్నాయని లెక్కలు చెబుతున్నా.. అదేస్థాయిలో సేకరణ జరగడం లేదు. వాహనాలకు రోజూ డీజిల్ కేటాయిస్తున్నారు. క్షేత్రస్థాయిలో చూస్తే 80-90 ఆటోలు తిరగడం లేదని తెలుస్తోంది.

ఏయే కాలనీల్లో అంటే..

☛ ఇంటింటా చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోలు రావడం లేదని పలు కాలనీల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

☛ కాజీపేట బాపూజీనగర్, దర్గా రోడ్, ప్రగతినగర్, సిద్ధార్థనగర్, హనుమకొండ ప్రాంతం భవానీనగర్, ప్రశాంత్‌నగర్, హంటర్‌రోడ్, రాంనగర్, ఎన్జీవోస్ కాలనీ, విద్యారణ్యపురి, కొత్తూరుజెండా, మచిలీబజారు తదితర ప్రాంతాలు.

☛ వరంగల్ ప్రాంతంలో రంగంపేట, రామన్నపేట, సంతోషిమాత కాలనీ, కొత్తవాడ, బ్యాంకు కాలనీ, కాశీబుగ్గ, లేబర్ కాలనీ, రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్‌తోట, శాంతినగర్, శివనగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటా చెత్త సేకరణ పూర్తిగా క్రమం తప్పింది.

మేమున్నాం.. మీకు తోడుగా

వర్ధన్నపేట: 99635 59929, ఖిల్లా వరంగల్: 98484 09191, పర్వతగిరి: 99896 42307, వరంగల్ తూర్పు: 97053 46535 (10 AM TO 1 PM)

వర్ధన్నపేట: ఇల్లంద గ్రామ శివారులో వరంగల్- ఖమ్మం జాతీయ రహదారి పక్కన చెత్తాచెదారం పడేస్తుండటంతో దుర్వాసనతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. - రాజు, కట్ర్యాల

సమాధానం: చెత్తను వేస్తున్న వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో చెత్త తొలగిస్తాం. - రామారావు, పంచాయతీ కార్యదర్శి, ఇల్లంద

సమస్య: వర్ధన్నపేటలోని శివాలయం వీధిలో మురుగు కాలువలో నీరు పారడం లేదు. దోమలు, ఈగలతో అవస్థలు పడుతున్నాం. - మల్లేషం, వర్ధన్నపేట

సమాధానం: మున్సిపల్ సిబ్బందితో సమస్య పరిష్కరిస్తాం. - జోనా, మున్సిపల్ కమిషనర్, వర్ధన్నపేట

రంగశాయిపేట: శంభునిపేట విశ్వనాథ కాలనీలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ పూలతో నిండిపోయింది. శుభ్రం చేయించగలరు. - శ్రీనివాస్ స్థానికులు

సమాధానం: రెండు రోజుల్లో శుభ్రం చేయిస్తాం. - కర్నె రవీందర్, కాలనీల అధ్యక్షుడు

మంత్రి సురేఖ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన


తెలంగాణ కూడలిలో నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్, నాయకులు

లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖ క్షమాపణలు చెప్పాలని కోరుతూ.. వరంగల్ లేబర్‌కాలనీలో భారాస శ్రేణులు గురువారం రాస్తారోకో చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో కూడలిలో ఆందోళనకు దిగారు. ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. 20 నిమిషాల పాటు వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ సినీనటి సమంత, అక్కినేని నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. నిరసనలో కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్ల రవి, మాజీ కార్పొరేటర్లు రాజేందర్, మోహన్, నాయకులు గన్నాపరు కుమార్, పొలెపాక సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు సిరులు కురిపిస్తాం

రామన్నపేట, న్యూస్‌టుడే: మత్స్యకారుల కుటుంబాల్లో సిరులు కురిపించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. గురువారం జిల్లా పాలనాధికారి డా.సత్యశారదతో కలిసి 40వ డివిజన్ ఉర్సు రంగసముద్రంలో చేప పిల్లలు వదిలారు. 100 శాతం రాయితీతో ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఉర్సు రంగసముద్రంలో గుర్రపుడెక్క, పిచ్చిచెట్లు, వ్యర్థాలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. పాలనాధికారి డా.సత్యశారద మాట్లాడుతూ.. 2024-25 సంవత్సరానికి గాను జిల్లాలోని 702 చెరువులు, ఒక రిజర్వాయర్‌లో 194.127 లక్షల చేప పిల్లలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్పొరేటర్లు మరుపల్ల రవి, అనిల్‌కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణి, స్థానిక మత్స్య సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు

క్రీడాకారిణికి ఘన సన్మానం



రాయపర్తి, న్యూస్‌టుడే: రాయపర్తి మండలం పన్యానాయక్ తండాకు చెందిన ఆంగోతు మౌనిక-యాకు దంపతుల కుమార్తె కావేరి ఇటీవల దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో జరిగిన హోమ్‌లెస్ ఫుట్‌బాల్ ప్రపంచకప్ పోటీల్లో పాల్గొన్నారు. గురువారం స్వగ్రామానికి చేరుకున్న ఆమెకు తండా వాసులు ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు.

మండల సమాఖ్యలో అధికారుల విచారణ..!

రాయపర్తి: మండల కేంద్రంలోని 'స్వర్ణభారతి మండల సమాఖ్య'లో జిల్లా అధికారులు గురువారం విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. సమాఖ్య ఆధ్వర్యంలో గతంలో ఓ ట్రాక్టరు సహా ఎనిమిది రకాల వ్యవసాయ పనిముట్లను కొనుగోలు చేశారు. వాటిని రైతులకు అందుబాటులో ఉంచి, వారి అవసరాలకు వినియోగించాలి. కానీ మండల సమాఖ్య పాలకవర్గం నిబంధనలు అతిక్రమించి సన్నూరు శివారు జయరాం తండాకు చెందిన ఓ వ్యక్తికి సుమారు 13.5 లక్షలకు ట్రాక్టరుతో పాటు పనిముట్లను విక్రయించారు. ఈ విషయం బయటకు పొక్కడంతో అతడితో అద్దెకు ఇచ్చినట్లుగా ఒప్పందం రాసుకున్నారు. ఈ విషయంపై స్థానికులు జిల్లా డీఆర్డీవోకు ఫిర్యాదు చేయగా.. ఆయన ఆదేశాల మేరకు గురువారం ఏపీడీ రేణుకాదేవి విచారణ చేపట్టారు. మండల సమాఖ్య సభ్యులు ట్రాక్టరు, పనిముట్లను విక్రయించినట్లు విచారణలో తేలింది. నివేదికను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి అందజేస్తామని రేణుకాదేవి తెలిపారు. డీపీఎంలు సరిత, దయాకర్, ఏపీఎం ధర్మేందర్, ఆడిటర్ సంపత్, సమాఖ్య పాలకవర్గం పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి 'హీరో గ్లామర్-ఓజీ'


కొనుగోలుదారుకు తొలి వాహనం ఇస్తున్న షోరూం యజమాని సత్యపాల్‌రెడ్డి

బాలసముద్రం, న్యూస్‌టుడే : నక్కలగుట్టలోని శ్రీవైష్ణవి ఆటో మొబైల్స్‌లో నూతనంగా హీరో గ్లామర్ - ఓజీ (ఒరిజినల్ గ్లామర్) ద్విచక్ర వాహనాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. షోరూం అధినేత చందుపట్ల సత్యపాల్‌రెడ్డి తొలి వాహనాన్ని కొనుగోలుదారుకు అందించారు. ఫుల్లీ డిజిటల్ స్పీడో మీటర్, ఇండికేటర్ హజార్డ్ స్విచ్, సెల్ఫ్ స్టార్టర్, ఇంజిన్ కట్ ఆఫ్ స్విచ్, అద్భుతమైన గ్రాఫిక్స్ ఫీచర్లతో వాహనాన్ని రూపొందించారన్నారు. దసరా, దీపావళి సందర్భంగా రెగ్యులర్ గ్లామర్‌పై రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు క్యాష్ బెనిఫిట్స్ అందిస్తున్నామని చెప్పారు. షోరూం మేనేజర్ మధు, సర్వీస్ మేనేజర్ జబ్బార్, ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి

సంగెం, న్యూస్‌టుడే: పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి, విజ్ఞాన సముపార్జనకు దోహదపడుతుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డా. రియాజ్ అన్నారు. గురువారం తీగరాజుపల్లిలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ప్రజా గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. నేటి యువత చరవాణులను వదిలి పుస్తక పఠనం వైపు అడుగులు వేయాలని సూచించారు. గ్రంథాలయం ఏర్పాటు చేసుకోవడానికి గ్రామస్థులు ముందుకు వస్తే సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోని పాఠశాలలో ఓ గదిని గ్రంథాలయం ఏర్పాటుకు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఆచార్యులు చింతం ప్రవీణ్, వాసం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బుధరావుపేట వేంకటేశ్వర ఆలయంలో..


నల్లబెల్లిలో..


వర్ధన్నపేటలో..

ఘనంగా దుర్గామాత ఉత్సవాలు

న్యూస్‌టుడే, జిల్లా యంత్రాంగం: జిల్లాలో దుర్గామాత ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ ఎంజీఎం కూడలిలోని శ్రీరాజరాజేశ్వరి దేవిని కుమారిగా అలంకరించి పూజలు చేశారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి.. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ప్రతిష్ఠించారు. రాయపర్తి మండలంలోని దుర్గామాత ఉత్సవాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం విరాళాలు అందించారు. తిర్మలాయపల్లిలో రూ.17 వేలు, కొండూరులో రూ.11 వేలు అందించారు.


ఖానాపురం సీతారామచంద్రస్వామి ఆలయంలో..


ప్రత్యేకాలంకరణలో రాజరాజేశ్వరి దేవి

☛ వరంగల్ దయానంద్ కాలనీలోని శ్రీకనకదుర్గా ఆలయంలో ఉత్సవాలను మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ సత్యశారదతో కలిసి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత, ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాశ్, ప్రతినిధులు సర్వారియా సురేశ్‌కుమార్, సింగిరికొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


కనకదుర్గా ఆలయంలో.. ఉత్సవాలు ప్రారంభిస్తున్న మంత్రి సురేఖ, చిత్రంలో మేయర్ సుధారాణి తదితరులు

అలంకరణ ఆలస్యం..

రంగంపేట: శ్రీభద్రకాళి దేవి శరన్నవరాత్రుల తొలిరోజే భక్తులు అసహనం వ్యక్తం చేశారు. అమ్మవారి పూర్ణాభిషేకం, అలంకరణ ఆలస్యం కావడంతో వందలాది మంది భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. బాలా త్రిపురసుందరి అలంకరణ పూర్తయ్యే వరకు గురువారం సాయంత్రం 6 గంటలైంది. ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే ఇలా జరిగిందని తెలిసింది.


శివనగర్ సీతారామాలయంలో..


రంగశాయిపేట రామాలయంలో..


నర్సంపేట కన్యకా పరమేశ్వరి ఆలయంలో..


గీసుకొండలోని శివాలయంలో..

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం

సంగెం, న్యూస్‌టుడే: మండల ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ అనారోగ్య కారణంతో గురువారం మృతి చెందాడు. జిల్లా ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు గాదె లింగమూర్తి, కమిటీ సభ్యులు దయాకర్, సత్యం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 60 వేలు ఆర్థిక సాయం అందించారు.

పైపు పగిలి మంటలు

రంగశాయిపేట, న్యూస్‌టుడే: శంభునిపేట శ్రీరామ్‌నగర్ కాలనీలోని మడూరి కిరణ్ ఇంట్లో గురువారం వంట చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు గ్యాస్‌పైపు లీకవడంతో మంటలు చెలరేగాయి. స్పందించిన స్థానికులు విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. అనంతరం నీళ్లు పోసి మంటలను ఆర్పివేశారు. సమాచారం అందుకున్న మట్టెవాడ అగ్నిమాపక సిబ్బంది శకటంతో అక్కడికి చేరుకోగా.. అప్పటికే మంటలు అదుపులోకి వచ్చాయి. వంట గదిలోని సామగ్రి పాక్షికంగా కాలిపోయాయి.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

రాయపర్తి, న్యూస్‌టుడే: మండలంలోని పలువురు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. బంధనపల్లి మాజీ సర్పంచి దీప్లానాయక్, అదే గ్రామానికి చెందిన డెక్క అశోక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారితో పాటు కొండూరు గ్రామ మాజీ సర్పంచి సోమ్లానాయక్ కుమార్తె శివాని అనారోగ్యంతో మృతిచెందగా.. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుధీర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ఉంటేనే బిల్లులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకపోతే బిల్లుల్లో కోత తప్పదని గ్రేటర్ వరంగల్ కమిషనర్ డా.అశ్విని తానాజీ సూచించారు. గురువారం వరంగల్ 13వ డివిజన్ ఎంహెచ్‌నగర్, గణేశ్‌నగర్‌లో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పరిశీలించారు. ఎంబీ పుస్తకంలో పొందుపర్చినట్లుగా క్షేత్రస్థాయిలో పనులు చేశారా? అని కొలతలు తీయించారు. ఆమె వెంట ఈఈ శ్రీనివాస్, డీఈ రంగారావు, ఏఈలు కృష్ణమూర్తి, ముజమ్మిల్ తదితరులున్నారు.

సంక్షిప్తంగా

'ఇష్టారీతిన ఓటరు జాబితా సవరణ'

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: కాశగూడెంలో ఓటర్ల జాబితాను పంచాయతీ కార్యదర్శి, స్థానిక భారాస నేతలతో కలిసి ఇష్టారీతిన సవరణ చేసినట్లు ఆరోపిస్తూ గురువారం గ్రామస్థులు పలువురు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఒక వార్డులో ఇల్లు ఉంటే మరో వార్డులో కావాలనే ఓట్లు నమోదు చేశారని ఆరోపించారు. గ్రామంలో ఓటరు జాబితా పూర్తిస్థాయిలో సవరించాకే.. పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. అభ్యంతరాలను పట్టించుకోకుండా జాబితా తయారు చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామస్థులు పటాన్ రజాక్, హుస్సేన్, సయ్యద్, మదర్, యాకూబ్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ జట్టు ఎంపిక పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: బాక్సింగ్ జట్టు ఎంపిక పోటీలు గురువారం హనుమకొండ జేఎన్ స్టేడియంలో జరిగాయి. బాక్సింగ్ హాలులో సబ్ జూనియర్, జూనియర్ విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 20 మంది బాక్సింగ్ క్రీడాకారులు హాజరయ్యారని కార్యనిర్వాహక కార్యదర్శి రాజేందర్ తెలిపారు. ప్రతిభ ఆధారంగా 11 మంది బాక్సర్లను ఎంపిక చేశామన్నారు. వీరు ఈ నెల 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లోని హకీంపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. శిక్షకులు ప్రభుదాస్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి


ఎంజీఎంలో రోగులకు అందుతున్న సేవలను సూపరింటెండెంట్ డా.మురళిని అడిగి తెలుసుకుంటున్న అధికారి కె.హైమావతి

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె. హైమావతి పేర్కొన్నారు. గురువారం హనుమకొండ ధర్మసాగర్ పీహెచ్‌సీని, వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిని ఆమె సందర్శించారు. కాలానుగుణ వ్యాధుల తీవ్రత, మందుల సరఫరా, అందుబాటులో ఉన్న పడకలు, వైద్యసేవలు, ల్యాబ్ పరీక్షలు నిర్వహిస్తున్న తీరు సహా వివిధ అంశాలను పరిశీలించారు. జనవరి నుంచి సెప్టెంబరు వరకు నమోదైన డెంగీ, మలేరియా కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఎంజీఎం ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది వివరాలపై ఆరా తీశారు. ఎంజీఎం సూపరింటెండెంట్ డా.మురళి, ఆర్ఎంవో కె.మురళి, వరంగల్, హనుమకొండ డీఎంహెచ్‌ఓలు వెంకటరమణ, లలితాదేవి, అడిషనల్ డీఎంహెచ్‌ఓలు సాంబశివరావు, . మదన్‌మోహన్‌రావు, . రాజ్‌కుమార్ . గోపిచంద్ తదితరులున్నారు.

గాలివాన బీభత్సం.. నేలకొరిగిన వరి


చెరువుకొమ్ము తండా గ్రామంలో..

పర్వతగిరి, న్యూస్‌టుడే: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం రాత్రి కురిసిన గాలివాన బీభత్సం సృష్టించింది. పర్వతగిరి, కల్లెడ, చెరువుకొమ్ము తండా, అన్నారం షరీఫ్, బూర్గుమళ్ల, రావూర్ తదితర గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో చేతికందొచ్చిన పంట నేలకొరిగింది. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. నష్టపోయిన పంటలకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: చెన్నారావుపేట గ్రామానికి చెందిన చింతకాయల చంద్రమౌళి(50) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఇటీవల తన వ్యవసాయ భూమి వద్ద పురుగుమందు తాగి పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఇంట్లో చోరీ.. నగదు అపహరణ

నల్లబెల్లి, న్యూస్‌టుడే: నారక్కపేట గ్రామానికి చెందిన పోగుల కుమారస్వామి ఇంట్లో గురువారం దొంగతనం జరిగింది. మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.42వేల నగదును అపహరించారు. బాధితుడు ఇంటికెళ్లి చూడగా.. తలుపు తెరిచి సామగ్రి చిందర వందరగా పడి ఉంది. దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై ప్రశాంత్‌బాబు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కార్పొరేటర్‌పై మంత్రికి ఫిర్యాదు

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: శ్రీగోవిందరాజస్వామి ఆలయ అర్చకులపై దాడులకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ.. స్థానిక కార్పొరేటర్ అనిల్‌పై చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు చేశారు. దీంతోపాటు అర్చకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. స్థానిక కనకదుర్గ ఆలయం వద్ద గురువారం మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఆలయ ఈఓ వారితో కుమ్మక్కై అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అర్చకులు వరయోగుల శ్రీనివాసస్వామి, మురళీకృష్ణస్వామి, ప్రసాద్‌స్వామి తదితరులున్నారు.

ద్విచక్ర వాహన దొంగ అరెస్టు

గీసుకొండ, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని దొంగలించిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన పేరుమాల్ గోపినాథ్(27)ను అరెస్టు చేసి గురువారం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై కుమార్ తెలిపారు. వరంగల్ పడమర కోటకు చెందిన మైదా మహేష్ గీసుకొండ మండలం చింతలపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో ట్రాక్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తన వాహనాన్ని పక్కన నిలిపి పనుల్లో నిమగ్నమయ్యాడు. సాయంత్రం వాహనం కనిపించకపోవడంతో ఠాణాలో ఫిర్యాదు చేశాడు. గురువారం ఊకల్‌హవేలీ వద్ద ఎస్సై కుమార్ వాహనాలను తనిఖీ చేస్తుండగా.. గోపినాథ్ ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకొని విచారించగా.. దొంగతనం చేసినట్లు ఒప్పుకొన్నాడు. అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మ దహనం

మట్టెవాడ, న్యూస్‌టుడే: నగరంలో మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మను హీరో నాగార్జున అభిమానులు దహనం చేశారు. గురువారం పాపయ్యపేట చమన్ కూడలిలో వరంగల్ జిల్లా అక్కినేని అభిమానుల సంఘం ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అక్కినేని అభిమానుల సంఘం అధ్యక్షుడు సదాంత్ మాట్లాడారు. నాగచైతన్య అభిమానం సంఘం అధ్యక్షుడు మున్నా, అభిమానులు రాజేష్ పాల్గొన్నారు.

● మంత్రి సురేఖ దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు ప్రకాశ్ డిమాండ్ చేశారు. మట్టెవాడ ఠాణా సీఐ గోపీరెడ్డికి వరంగల్ తూర్పు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. మంత్రి సురేఖపై ట్రోలింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జన్ను నూతన్‌బాబు రాష్ట్ర మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేశారు.

నర్సంపేట నియోజకవర్గం

పారదర్శకంగా డిజిటల్ స్మార్ట్ కార్డుల సర్వే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఆరోగ్యశ్రీ వంటి అన్ని పథకాలకు డిజిటల్ స్మార్ట్‌కార్డులను ప్రామాణికంగా తీసుకుంటారని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలో చేపట్టిన డిజిటల్ స్మార్ట్‌కార్డు సర్వేను గురువారం ఆయన ప్రారంభించారు. డిజిటల్ స్మార్ట్‌కార్డుల సర్వే పారదర్శకంగా చేయాలని అధికారులను ఆదేశించారు. పేదలు, జర్నలిస్టులకు ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. మార్కెట్ ఛైర్మన్ శ్రీనివాస్, ఆర్డీవో కృష్ణవేణి, కమిషనర్ జోనా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దుగ్గొండి: జీవితంలో అన్ని సేవలకు ఉపయోగపడే కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను సమగ్రంగా పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని మధిర మందపల్లిలో కుటుంబ డిజిటల్ స్మార్ట్ కార్డుల పైలట్ ప్రాజెక్టును గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆర్డీవో కృష్ణవేణి, ఎంపీడీవో అరుంధతి, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏవీఆర్ సేవలు మరవలేనివి

నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సహకార రంగంలో దివంగత మాజీ ఎమ్మెల్యే అర్శనపల్లి వెంకటేశ్వర్‌రావు సేవలు మరవలేనివని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట మండలం ముగ్దుంపురంలోని శ్రీరామ విత్తన పరస్పర సహకార సంఘంలో ఏవీఆర్ 15వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చెన్నారావుపేట : అర్శనపల్లి వెంకటేశ్వర్‌రావు వర్ధంతిని పురస్కరించుకొని చెన్నారావుపేటలో సొసైటీ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి, వైస్ ఛైర్మన్ వంశీ తదితరులు నివాళులర్పించారు.

లోలెవల్ కల్వర్టుకు మరమ్మతులు

నెక్కొండ: గత నెలలో కురిసిన వర్షాలకు నెక్కొండ- కేసముద్రం మార్గం వెంకటాపురం గ్రామ సమీపంలో ఉన్న లోలెవల్ కల్వర్టు ధ్వంసమైంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళలో ప్రమాదాలకు గురవుతున్నారు. గురువారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కల్వర్టును పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, నెక్కొండ, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్లు హరీశ్‌రెడ్డి, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ అవసరం

నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నర్సంపేట మండలం ముత్తోజిపేటలో పంచాయతీ నిధుల దుర్వినియోగంపై అధికారులు విచారణ చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం వినతిపత్రాన్ని అందించారు. గత పంచాయతీ పాలకవర్గంలో ఎలాంటి తీర్మానం లేకుండానే రూ.3 లక్షలను సర్పంచి, ఉప సర్పంచి సొంతానికి వాడుకున్నారని ఆరోపించారు.

గౌరవ వేతనం అందించాలని వినతి

నర్సంపేట, న్యూస్‌టుడే: రేషన్ డీలర్లకు రూ.5వేల గౌరవ వేతనం, బస్తాకు రూ.300ల కమీషన్ అందించాలని చౌక డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నర్సంపేటలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలోని డీలర్లు పాల్గొన్నారు.

కేయూ వీసీగా స్థానికులకు అవకాశం ఇవ్వాలి

నర్సంపేట, న్యూస్‌టుడే: కేయూ ఉప కులపతిగా స్థానికులకు అవకాశం కల్పించాలని భారాస రాష్ట్ర నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం నర్సంపేటలో ఆయన మాట్లాడారు. సామాజిక, విద్య, భౌగోళికతో పాటు ఇతర అంశాల గురించి క్షుణ్ణంగా తెలిసిన వారిని నియమించాలన్నారు. కేయూ అభ్యున్నతికి ప్రత్యక్షంగా పాల్గొనే ఆచార్యులను నియమిస్తే విద్యార్థులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

భారీగా గుట్కా పట్టివేత

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేట పట్టణంలో అక్రమంగా నిషేధిత అంబర్, గుట్కా, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న దుకాణాలపై గురువారం రాత్రి పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. రూ.1.42 లక్షల ఉత్పత్తులను పట్టుకున్నారు. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో పాకాల రోడ్డు కూడలిలోని పర్మార్ పురాన్‌సింగ్ అనే వ్యాపారి నవదుర్గ ఏజెన్సీ పేరుతో దుకాణం నిర్వహిస్తున్నాడు. పొగాకు ఉత్పత్తులను దొంగ చాటుగా అధిక ధరలకు అమ్ముతున్నాడు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దుకాణంపై దాడి చేశారు. గోనె సంచుల్లో పొగాకు ఉత్పత్తులను నిల్వ చేయగా గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని సదరు వ్యాపారి పురాన్‌సింగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.